క్లుప్తంగా

సున్నితమైన హాస్యానికి చిరునామా జంధ్యాల



విజయవాడ కల్చరల్: సున్నితమైన హాస్యానికి చిరునామా దర్శకుడు జంధ్యాల అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జంధ్యాల విగ్రహం వద్ద 73వ జయంతి నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ జంధ్యాల కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాలకు దర్శకత్వం వహించినట్లు తెలిపారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి మాట్లాడుతూ జంధ్యాలకు నగరంతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ఆయన దర్శకుడు మాత్రమే కాదని, మాటల రచయిత, కథా రచనలోనూ ప్రతిభ చూపించారన్నారు. ఆయన అనేక సాంఘిక నాటికలకు కూడా రచించినట్లు తెలిపారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం, రామ్మోహనరావు సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి చివుకుల హరగోపాల్, కళాకారుడు మాగలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నిర్వాహకులు జంధ్యాల విగ్రహానికి నివాళులర్పించారు.

19 నుంచి వనవలమ్మ జాతర

మచిలీపట్నంటౌన్: స్థానిక నిజాంపేటలోని నూతి వీరయ్య ఆదివనవలమ్మ దేవి 107వ వార్షిక గ్రామోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి జరుగుతాయని నిర్వాహకులు నూతి వన వెంకట సత్యనారాయణ (రమణ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 8.15 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ఆలయంలో 101 దేవతల నామాలతో పూజా కార్యక్రమం, 20న అమ్మవారికి పసుపు, కుంకుమ ఉత్సవం, 21న జాతర మహోత్సవం, 22న అమ్మవారికి వెండిచీర అలంకరణ, అన్న సమారాధన జరుగుతుందన్నారు.

భోగభాగ్యాల భోగి

- గ్రామాల్లో సంక్రాంతి సందడి
- ఉత్సాహంగా భోగి మంటలు



గుడ్లవల్లేరులో భోగి మంటలు వేస్తున్న యువకులు



తోట్లవల్లూరులో ముగ్గులను పరిశీలిస్తున్న దృశ్యం

పామర్రు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలిరోజు భోగి పండుగను ఆదివారం ప్రజలు అందరూ సంతోషాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భోగి మంటలు వేశారు. ఇళ్లల్లో పాత సామగ్రిని భోగి మంటల్లో వేసి ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆనందించారు. జమీదగ్గుమిల్లి, రాపర్ల, పామర్రు, అడ్డాడ, పెదమద్దాలి తదితర గ్రామాలలోని ప్రజలు భోగి పండుగ సందర్భంగా భోగి వేడుకలు నిర్వహించారు

అలరించిన బొమ్మల కొలువులు

భోగి పండుగ సందర్భంగా చిన్నారులు బొమ్మల కొలువులను గృహాల్లో ఏర్పాటు చేసుకున్నారు.

- చిన్నారులకు భోగిపళ్లను పోసి ముత్తయిదవులకు తాంబూలాలు అందజేశారు.
- **గుడ్లవల్లేరు** : మండలంలో తెల్లవారుజాము నుంచి యువకులు, చిన్నారులు పనికి రాని వస్తువుల్ని మంటల్లో వేసి, కొత్త కాంతుల కోసం పెద్ద పండుగ సంక్రాంతిని ఆహ్వానించారు.

స్టేడియం కార్మికులకు దుస్తులు అందజేత

గుడివాడ టౌన్: సామాజిక సేవకుడు ఆర్కే యూత్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణ (ఆర్కే) సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ముఖ్యమైన పండుగగా సంక్రాంతి జరుపుకుంటున్న తరుణంలో స్టేడియంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ సేవలందిస్తున్న వీరికి ఈ చిరు కానుక అందజేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దుస్తులు, దుప్పట్లు , స్వీట్లు, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్కే యూత్ వారియర్స్ షేక్ మీరా షరీఫ్, నూనె అయ్యప్ప, గంటా ఆంజనేయులు, చరణ్‌తేజ, దివిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భోగి పండుగను పురస్కరించుకుని మహిళలకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

స్థానిక శివాలయం సెంటర్‌లోని తెలుగు లలిత కళా తోరణం వద్ద రంగవల్లుల పోటీలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో రక రకాల ముగ్గులను వేసి వాటిలో రంగులను అద్దారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు ప్రతమ బహుమతిగా వెట్ గ్రైండర్, ద్వితీయ బహుమతిగా గ్యాస్ స్టౌ, తృతీయ బహుమతిగా పూజా సామగ్రి ఉయ్యాలను అందజేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీ సుధాకర్, కోశాధికారి కంచర్ల వీరజనార్ధన రావు, వనిత క్లబ్ అధ్యక్షులు ఘంటసాల సునీత, ప్రధానకార్యదర్శి చిన్నం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: మండలంలో భోగి వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే పిల్లలు, పెద్దలు, యువకులు పలు చోట్ల భోగి మంటలు వేసి సందడి చేశారు. తోట్లవల్లూరుతోపాటు భద్రిరాజుపాలెం, గరికపర్రు గ్రామాలు బంధువులు రాకతో కళకళలాడాయి. తోట్లవల్లూరులో జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు సోలే నాగరాజు, గొరిపర్తి సూర్యనారాయణ, గోనేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యాన సంక్రాంతి పోటీలు నిర్వహించడం అభినందనీయమని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. వాలీబాల్, రన్నింగ్, ముగ్గుల పోటీల విజేతలకు ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ ఎం. కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి మెమెంటోలు, నగదు బహుమతులను అందజేశారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, దేవరపల్లి సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు యార్లగడ్డ శివయ్య, సామాజిక కార్యకర్త మత్తే విజయ నాగరాజు, తోట్లవల్లూరు, పమిడి ముక్కల ఎస్ఐలు విశ్వనాథ్, కిషోర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో క్లబ్ అధ్యక్షుడు సాయిరాం

విద్యార్థులు గాలి పటాల ప్రదర్శన

పామర్రు: విద్యార్థులకు గాలి పటాల ప్రదర్శన పోటీలను ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పామర్రు వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రతమ బహుమతిగా స్కూల్ బ్యాగ్, ద్వితీయ బహుమతిగా క్యారేజి, తృతీయ బహుమతిగా వాటర్‌బాటిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఘంటసాల త్రివిక్రమసాయిరాం, చిన్నం మురళీ సుధాకర్, కోశాధికారి కేవీ జనార్ధనరావు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణంపై హర్షాతిరేకాలు



పోర్టు పనులు పరిశీలిస్తున్న ప్రజలు

మచిలీపట్నంటౌన్: బందరు పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతుండటంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. చురుకుగా జరుగుతున్న పోర్టు పనులను తిలకించేందుకు ఆదివారం ప్రజలు ఆ ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోర్టు పనుల సందర్శనకు అనుమతులు ఇవ్వటంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పరిశీలించారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన వారు ఆ ప్రాంతంలో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు. నెలాఖరు వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పోర్టు పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచనల మేరకు అవకాశం ఇచ్చారు. భావితరాలకు పోర్టు నిర్మాణం ఎంతో ఉపయోగమని హైదరాబాద్‌కు చెందిన ప్రశాంత్ తెలిపారు. ఇన్నాళ్లకు బందరు పోర్టు కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని బెంగళూరులో ఉద్యోగం చేసే లక్ష్మీ హారిక చెప్పారు.

నేడు అయ్యప్ప మకర జ్యోతి దర్శనం

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్ప స్వామి వారి దేవాలయం వద్ద సోమవారం భక్తులకు మకర జ్యోతి దర్శనాన్ని కల్పించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావనారాయణ ఆదివారం తెలిపారు. ఉదయం ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని, సాయంత్రం స్వామి వారి నగలను ఊరేగించనున్నట్లు చెప్పారు. ఊరేగింపు అనంతరం అయ్యప్పకు ప్రత్యేక అలంకారం చేసి, మకర జ్యోతి దర్శనాన్ని కల్పిస్తామని వివరించారు.

ప్రయాణికురాలి నగదు, నగలు మాయం

పెడన: బస్సులో ప్రయాణికురాలి వద్ద నగదు, నగలు ఉన్న బ్యాగు మాయం కావడంపై కేసు నమోదైంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మచిలీపట్నం గాంధీనగర్‌కు చెందిన పులవర్తి ఉమాదేవి ఈ నెల 12వ తేదీ మచిలీపట్నం నుంచి శింగరాయపాలెం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. పెడన దాటిన తరువాత తన సంచి తెరిచి చూస్తే రూ.1.26 లక్షలు నగదు, సుమారు 18.2 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో కంగారుపడ్డ ఆమె సంచిని పలుమార్లు వెదికినా కనిపించలేదు. ఇంటి వద్ద ఏమైనా మరిచిపోయాననే అనుమానంతోనే శింగరాయపాలెంలో బస్సు దిగి ఓ శుభకార్యానికి హాజరైంది. 13వ తేదీ సాయంత్రం మచిలీపట్నంలోని తన ఇంటికి వెళ్లి పరిశీలించగా నగదు, నగలు కూడా కనిపించలేదు. దీంతో వేర్వేరు చోట్ల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న తన కుమారుడు విజయ్‌కు, భర్త సత్యనారాయణ (కానిస్టేబుల్)కు సమాచారం ఇచ్చి చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఫిర్యాదు విన్న అక్కడ సిబ్బంది పెడన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించడంతో ఆమె పెడన పీఎస్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. తన పక్కన కూర్చున్న వారు పెడన బస్టాండులో 12వ తేదీ సాయంత్రం 6.20 గంటల సమయంలో బస్సు దిగి వెళ్లి పోయారని, వారిపై అనుమానం ఉందని, వారిని చూస్తే మళ్లీ గుర్తుపడతానని తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పెడన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరువురు యువకులు

కురుమద్దాలి(పామర్రు): పండుగ పూట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కురుమద్దాలి గ్రామానికి చెందిన పంది చిన్న గోవిందు (22), తోలేటి హరి (22) ఇద్దరూ హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నారు. పండుగకు వారి స్వగ్రామం వచ్చారు. ఆదివారం భోగి పండుగ కావడంతో ఉదయం ద్విచక్రవాహనంపై గ్రామ పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లి పెట్రోల్ పోయించుకుని తిరిగి గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి గ్రామానికి వచ్చే సర్వీస్ రోడ్డులో అదే మార్గంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేశారు. దీంతో ట్రాక్టర్ వెనుకాల ఉన్న స్కూటీ వేగంగా వెనుక భాగాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లి పోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేర కు పోలీసులు ఘటనా స్థలం చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామ ని ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణం



పామర్రులో కల్యాణమూర్తులుగా గోదాదేవి రంగనాథ స్వామివార్లు

పామర్రు: ధనుర్మాసంలో చివరి రోజు ఆదివారం అన్ని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి రంగనాథస్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస పూజా తిరుప్పావై ముగింపు సందర్భంగా శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి అభిషేకాలు, ధనుర్మాస పూజలు చేశారు. అనంతరం రుత్వికులు తమిరిశ వేద ప్రకాష్ వేద మంత్రాల నడుమ మేళ తాళాలతో స్వామివార్ల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు కాజ వెంకట ప్రసాదరావు రాధామణి, లక్ష్మీసింధూర, తాళ్లూరి రామారావు దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి, సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు ఆర్.ప్రసాద్, ఆర్.గోపి, భక్తులు బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లిలో

గ్రామంలో శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు వేదాంతం తిరుమలాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

నిమ్మకూరు(పామర్రు): ధనుర్మాసంలో శ్రీనివాస గోదా కల్యాణం చేసినా, చూసినా సకల పాపాలు హరణం కాగలవని నిమ్మకూరు టీటీడీ అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు పేర్కొన్నారు. నిమ్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస గోదాదేవిల కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టరు బూరగడ్డ శ్రీనాథ్, శ్రీ వెంకటేశ్వర అన్న ప్రసాద సేవ ట్రస్టు అధ్యక్షులు సూరపనేని చంద్రశేఖర్‌రావు, కార్యదర్శి నందమూరి జయ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పెడన: పెడన భట్ల జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్ 1989–90 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకుని తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

ఆటో ఢీకొని లారీడ్రైవర్ దుర్మరణం

ఉంగుటూరు: ఆటో ఢీకొని లారీ డ్రైవర్ దుర్మరణం చెందిన ఘటన చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై తేలప్రోలు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడకు చెందిన షేక్ హర్షద్ హుస్సేన్ (59) లారీ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి ఏలూరు వైపు లారీపై వెళుతున్నాడు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఫ్లై ఓవర్ మొదట్లో లారీని నిలిపి నడుచుకుంటూ రోడ్డు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి వేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్కూరు ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

నాగాయలంక: మండలంలోని ఎదురుమొండి దీవిలో అడవి పందుల గుంపు అడ్డు వచ్చి బైక్‌పై నుంచి పడి గాయపడిన ఆరేపల్లి వెంకటేశ్వరరావు (50) అనే వ్యక్తి మరణించినట్లు ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ఆదివారం రాత్రి తెలిపారు. గొల్లమంద గ్రామస్తుడు వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో తన బైక్‌పై పొలానికి వెళ్తున్నాడు. ఇంటి నుంచి కొంత దూరం వెళ్లాక ఒక్కసారిగా అడవి పందుల గుంపు రోడ్డుమీదకు వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో కింద పడి గాయపడ్డాడు. దెబ్బలతోనే ఇంటికి రావడంతో వెంటనే కుటుంబసభ్యులు గ్రామీణ వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయాడు. వెంకటేశ్వరరావు భార్య రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఘటనపై కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

పెనమలూరు: ఉరేసుకొని వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కానూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... సనత్‌నగర్ కబరస్తాన్ రోడ్డులో షేక్ మున్వర్ బాషా కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఆయన తండ్రి 2003 లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో తల్లి ముంతాజ్‌బేగం(60) కుమారుడు మున్వర్‌బాషాతో కలిసి ఉంటుంది. కాగా 13వ తేదీన ఇంట్లో అందరూ నిద్ర పోమారు. 14వ తేదీన ఉదయం 5.30 గంటలు ముంతాజ్‌బేగం తన గది నుంచి బయటకు వచ్చి మంచినీళ్లు తాగి మరలా గదిలోకి వెళ్లింది. కొద్ది సమయం తరువాత మున్వర్‌బాషా భార్య ఆయేషాసిద్ధిక నమాజ్ చేయటానికి ముంతాజ్‌బేగం గదిలోకి వెళ్లి చూడగా సీలిం ఫ్యాన్‌కు ఉరేసుకొని ముంతాజ్ బేగం వేలాడుతూ కనిపించటంతో బిగ్గరగా కేకలు వేసింది. వెంటనే మున్వర్‌బాషా సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతున్న తల్లిని దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. తన తల్లి మానసికస్థితి సరిగా లేక పోవటంతోనే ఉరేసుకొని మృతి చెందిందని మున్వర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: కానూరులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కానూరులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.16,200 సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



■ **పేదలు సంతోషంగా ఉండాలి**

కైకలూరు: ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. ఆటపాకలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ మణి జాన్, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి పండుగ



కైకలూరులో జరిగిన 'భోగి' వేడుకల్లో ఎమ్మెల్యే డీఎన్నార్, కుటుంబ సభ్యులు

కైకలూరు: మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిదైన భోగభాగ్యాల భోగి పండుగను గ్రామాల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయమే ఇంటిల్లిపాదీ అభ్యంగన స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. కైకలూరు ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) భోగి మంటను వెలిగించారు. సతీమణి వీరాకుమారి, కుమారులు వినయ్, శ్యామ్ కుటుంబ సమేతంగా భోగి మంట వద్ద సందడి చేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గంగిరెద్దుల కళాకారులను సత్కరించారు. కైకలూరు వెలంపేట, బైపాస్‌రోడ్డు, బృందావనం కాలనీ, రైల్వేస్టేషన్ వద్ద భోగిమంటలు ఆకట్టుకున్నాయి.

■ **మండవల్లి:** మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పురస్కరించుకుని ఆదివారం భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వివిధ ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

■ సంక్రాంతి శోభలో గంగిరెద్దుల విన్యాసాలను మండవల్లి ప్రజలు ఆనందోత్సాహాలతో వీక్షిస్తున్నారు.

కైకలూరు: ఆచవరం గ్రామంలో బీఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ అధినేత బూరుబోయిన శ్రీనివాసరావు(బీఎస్సార్) ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

■ **ఎమ్మెల్యే డీఎన్నార్ చొరవతో రిక్వెస్ట్ బస్‌స్టాప్**

కలిదిండి: ఏలూరు - నరసాపురం మధ్య ప్రయాణించే చినతాడినాడ, ఉప్పుటేరు పరిసర ప్రాంత ప్రజలకు ప్రధాన సమస్య ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉప్పుటేరు సెంటర్‌లో ఆగకపోవడం. చినతాడినాడ గ్రామస్తులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఎక్స్‌ప్రెస్ బస్‌లు ఆగడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో ఆదివారం ఉప్పుటేరు సెంటర్‌లో రిక్వెస్ట్ బస్‌స్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు. చినతాడినాడ గ్రామ సర్పంచ్ గండికోట ఏసుబాబు, వైస్ సర్పంచ్ యాళ్ల స్టీవెన్ సన్, వైఎస్సార్ సీపీ నాయకులు జంపన రామరాజు (చిన రాము), కుసంపూడి సత్తులు రాజు, పామర్తి సత్యనారాయణ, నాగరాజు, రత్నరాజు ఎమ్మెల్యే డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

■ **కల్యాణం కమనీయం**



కైకలూరు: ధనుర్మాస మహోత్సవాల ముగింపు సందర్భంగా గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) కల్యాణం శ్యామలాంబ దేవస్థాన కల్యాణ మండపం వద్ద ఆదివారం కనులపండుగగా జరిగింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఆయన సతీమణి వీరాకుమారి ఊరేగింపులో పాల్గొన్నారు. యాగ్నిక బ్రహ్మ ప్రవీణ్‌కుమార్, ఆలయ అర్చక అగ్నిహోత్రం మారుతీప్రసాదాచార్యులు కల్యాణ క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో మీసాల వెంకన్న, శ్యామలాంబ, శ్రీరామలింగేశ్వర దేవస్థానాలు చైర్మన్లు బొప్పన శివకుమార్, గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు, ధర్మకర్తల మండల సభ్యులు పాల్గొన్నారు.

42 మద్యం సీసాలు స్వాధీనం

కైకలూరు: నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు చేసి 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన నగర సంకీర్తన

మండవల్లి: స్థానిక శ్రీ షిర్డీసాయిబాబా భక్త సమాజం ఆధ్వర్యాన ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు నిర్వహించిన నగర సంకీర్తన ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటల వరకు నగర సంకీర్తన చేశారు. నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ, రమణారావు, చిన్నారులు పాల్గొన్నారు.